

పర్యవేక్షణ లోపంతో మొక్కలు ఎండి పోయి చిట్టడవిగా మారిన వెల్మకన్న గ్రామ పల్లె ప్రకృతి వనాన్ని చూపిస్తున్న బిజెపి జిల్లాఉపాధ్యక్షులు రాజేందర్, మండలాధ్యక్షులు రాఖేష్‌లు

## నిధుల లేమితో నిర్లక్ష్యం నీడలో... పల్లె ప్రకృతి వనాలు

-ఎండకు ఎండి పోయి దీనస్థితిలో చేరిన మొక్కలు

**కౌడిపల్లి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** నిధుల లేమితో నిర్లక్ష్యం నీడలో పల్లె ప్రకృతి వనాలు పూర్తిగా ఆదరణ కరువైపోయి చిట్టడవిగా మారిన మండల వ్యాప్తంగా ఉన్న పల్లె ప్రకృతి వనాల పరిస్థితి. గత ప్రభుత్వ హయంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి, ఆమలు పరిచిన పల్లె ప్రకృతి వనాలు పచ్చని మొక్కలు, చెట్లతో ప్రశాంతమైన వాతావరణం కల్గి, చల్లటి గాల్లుతో విరాజిల్లేటివి. నాడు పల్లె ప్రకృతి వనాలకు ప్రతినిత్యం పర్యవేక్షణకు గాను ప్రభుత్వ హాయంలో మండల సర్పంచులు సొంత డబ్బులతో అభివృద్ధి చేసినప్పటికి, కొంత మంది సర్పంచులకు ఖర్చుచేసిన బిల్లులు రాకపోవడంతో వాటిని వదిలివేశారు. తెలంగాణ రాష్ట్రంలో సర్పంచుల పదవీకాలం ముగిసిన తిరిగి సర్పంచుల ఎన్నికలను నిర్వహించుటకు సంవత్సరం కాలం పట్టింది. ఈ కాలంలో గ్రామానికి ప్రత్యేక అధికారిగా పంచాయతీ కార్యదర్శిని ప్రభుత్వం నియమించడంతో గ్రామాభివృద్ధితో పాటు పల్లె ప్రకృతి వనాల పర్యవేక్షణలో భాగంగా ప్రతి రోజు పంచాయతీ నీళ్ల ట్యాంకర్‌తో నీళ్ళు పట్టేవారు. వీటికి ఖర్చులు చేసిన నిధులు ప్రభుత్వం నుండి బిల్లులు చెల్లింపులో తీవ్ర జాప్యం రావడంతో పల్లె ప్రకృతి వనాల పర్యవేక్షణ కార్యదర్శులకు తలకు మించిన భారంగా మారిపోయింది. దీంతో ప్రకృతి వనాలు ఎలాంటి ఆదరణ లేకపోకవడంతో మొక్కలు ఎండకు ఎండిపోయి చిట్టడవిలాగా మారిపోయాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల నుండి లక్షలు పెట్టి పల్లె ప్రకృతి వనాలను అభివృద్ధి పర్చినప్పటికి, నేడు వాటిని పట్టించుకోనే నాథులు సర్పంచులు, కార్యదర్శులు, అధికారుల నిఘాలు లేక నిరుపయోగంగా వదిలివేయడం చాలా బాధాకరమైన విషయం. పల్లె ప్రకృతి వనాల అభివృద్ధి యొక్క లక్ష్యం నెరవేరకముందే పూర్తిగా శిథిలావస్థలో చేరిపోయి, వాటికి ఉన్న పల్లె ప్రకృతి వనాల బోర్డు సైతం కనుమరగైపోయింది. కొన్ని పంచాయతీలకు ప్రభుత్వం అందించిన ట్రాక్టర్లు, నీళ్ల ట్యాంకర్లు ఉన్నా కూడా నూతనంగా ఎన్నుకున్న గ్రామ సర్పంచులు, కార్యదర్శులు వాటిని పట్టించుకోకపోవడం విధుల పట్ల నిర్లక్ష్యమా లేక నిర్వహణ ఖర్చులు అధికమైతాయని ప్రభుత్వం బిల్లులు చెల్లించడంలో జాప్యం చేస్తుందనే ఉద్దేశంతో పల్లె ప్రకృతి వనాల జోలికి పోవడం లేదని చెప్పకనే తెలుస్తుంది. వెల్మకన్నె గ్రామ పల్లె ప్రకృతి వనం పర్యవేక్షణ చేయకపోవడంతో చిట్టడివిగా మారిపోయిందని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఖాజీపేట రాజేందర్, మండల అధ్యక్షులు రాఖేష్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు చేసి పల్లె ప్రకృతి వనాలను పచ్చటి సామాజిక అటవీ ప్రాంతాలుగా తీర్చిదిద్దగలరని పలువురు తమ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద ఆర్టీసీ ప్రయాణికుల నరకయాతన

**సదాశివపేట ,ఏప్రిల్ 26, ప్రభాతవార్త :**

భగ భగ మండుతున్న సూర్యకిరణాల కింద ప్రయాణించే వందలాదిమంది ప్రయాణికులు, తాత్కాలిక షెల్టర్లు లేకుండా ఎండలో నిలబడడం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణించే పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద ప్రయాణికుల కోసం కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేవు. ఎడారి సమ్మో హనంగా ఉండే వాతావరణం మరియు భానుడి వేడి కింద, ఆర్టీసీ సౌకర్యాల లేమి ప్రస్తుత పరిస్థితిని మరింత బలపరిచింది.సంగారెడ్డి నుండి హైదరాబాద్ వెళ్లే బస్సులు పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ఉన్న పెట్రోల్ బంకు వద్ద ఆగుతుంటే, అక్కడ బస్ నిలిపేందుకు సరైన స్థలం లేకుండా ప్రయాణికులు ఎక్కడ ఆగుతుందో తెలియకుండా అటు ఇటు పరిగెత్తుతూ ఉంటారు. దీనితో వారి ప్రయాణం మరింత కష్టంగా మారిపోతుంది. ఇక హైదరాబాద్ నుండి సదాశివపేట మీదుగా బీదర్ వరకు ప్రయాణించే బస్సులు కూడా ఎండలో నిలబడే స్థలాలు లేకుండా ప్రయాణించే ప్రయాణికుల నిరాశను పెంచుతాయి.ప్రజలు అడుగుతున్నది ఏంటంటే, ఆర్టీసీ ఆదాయాలను తెచ్చి పెట్టే ప్రయాణికులకు కనీసం ఎండాకాలంలో తాత్కాలిక నీడలను ఏర్పాటు చేయడమే కాదు, ఈ ప్రయాణికుల కష్టాలను తేలికపరచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పిలుపునిస్తున్నారు.భవిష్యత్తులో, ఆర్టీసీ ప్రయాణ సౌకర్యాలు మెరుగుపరచడానికి ప్రభుత్వం, సంబధిత అధికారుల దృష్టి సాధించి తాత్కాలిక షెడ్డును ఏర్పాటు చేయాలని కోరుతున్ను.



మండుటెండలో బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు....

## అక్రమంగా ఇసుక తరలింపు-పట్టించుకోరెవరూ

**నాగల్‌గిద్ద, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కారముంగి మంజీర పరివాహ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకును తరలిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. మంజీర పర్వత ప్రాంతంలో నీటిమట్టం తగ్గడంతో అక్రమార్కులకు ఇసుకను యధేశ్చగా జేసిబి సహాయంతో భారీ వాహనాల్లో ఇసుకును నింపుకుని ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుం టున్నారు. అక్రమంగా ఇసుక వ్యాపారం కొనసాగుతున్నా అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా ఉంటుండటం పట్ల ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాల్సి న అవసరం ఉందని ప్రజలు సూచిస్తున్నారు.



మంజీర పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను తరలిస్తున్న దృశ్యం

## కాలిపోయిన స్ప్రింక్లర్ పైపులు

**చిన్నకోడూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :**

కరెంటు తీగల నుంచి పడిన మిరుగులతో స్ప్రింక్లర్ పైపులు కాలిపోయిన సంఘటన



కాలిపోయిన స్ప్రింక్లర్ పైపుల్‌ను చూపుతున్న బాధిత మహిళ రైతు

మండల పరిధిలోని చంద్లాపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధిత రైతు చిగురు పద్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంటు తీగల నుంచి ఒక్కసారిగా మెరుగులు పడి మంటలు చెలరేగి అక్కడే ఉన్న రెండు సెట్ల స్ప్రింక్లర్ల పైపులు పూర్తిగా కాలిపోయి రూ.80 వేల నష్టం జరిగినట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో సమస్య ఉందని అక్కడే మేకల పాక ఉందని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ తొలిగించాలని విద్యుత్ అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదన్నారు. కాలిపోయిన స్ప్రింక్లర్ పైపులకు విద్యుత్‌శాఖ నష్ట పరిహారం అందించాలని కోరారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

## అట్టహాసంగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

-క్రీడోత్సవాలు నిర్వహించడం అభినందనీయం
-క్రీడలతో మానసిక ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుంది
-ప్రముఖ వైద్యులు డాక్టర్ దయాకర్ రెడ్డి



క్రీడోత్సవాలు ప్రారంభిస్తున్న దృశ్యం

**పటాన్ చెరు,ఏప్రిల్ 26,ప్రభాత వార్త :**
మానసిక ఒత్తిడి నుండి ఆరోగ్యంగా ఉండటానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని మేడే సందర్భంగా క్రీడోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని ప్రముఖ వైద్యులు రాంరెడ్డి మెమోరియల్ హాస్పిటల్ డాక్టర్ దయాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం పాశమైలారం పారిశ్రామికవాడ మార్కెట్ గ్రౌండ్ లో నిర్వాణ కమిటీ ఆధ్వర్యంలో మేడే క్రికెట్ టోర్నమెంట్ ను డాక్టర్ దయాకర్ రెడ్డి టాస్ వేసి ప్రారంభించారు. వాగ్బాల్స్ పరిసర ఎండి బౌలింగ్ చేయగా దయాకర్ రెడ్డి బ్యాటింగ్ చేసి ఆడారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. కార్మికులు రోజువారిగా డ్యూటీలు చేస్తూ మానసిక ఒత్తిడి గురవుతారనీ, క్రీడలు ఆడడం ఆరోగ్యంగా ఉండటానికి ఎంతో పడుతుంది నిరంతరం కార్మికుల సమస్యలపై పనిచేస్తున్న సిఐటియు మేడే సందర్భంగా క్రీడలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అతిమేల మాణిక్ మాట్లాడుతూ.. మేడే సందర్భంగా శ్రామికోత్సవాలు అత్యంత జయప్రదంగా నిర్వహించాలని అన్నారు. కార్మికుల శ్రమతోనే సంపద సృష్టించబడుతుందని తర్వాత దేశ నిర్మాణంలో కార్మికుల శ్రమ కీలక పాత్ర అని శ్రమను గౌరవిద్దాం అని అన్నారు. లేబర్ కోడ్స్ తో కార్మికుల హక్కులపై దాడి జరుగుతుందని మేడే స్ఫూర్తితో వాటిని ప్రతిఘటించాలని అన్నారు. మేడే శ్రామికోత్సవాల నిర్వాణ కమిటీ కన్వీనర్ వివిఎస్ రాజు మాట్లాడుతూ.. క్రికెట్ టోర్నమెంట్ కు 12 టీములు వచ్చినాయని స్నేహపూర్వకంగా ఆటలు అన్నారు. మేడే సందర్భంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వాటికి అందరు సహకరించాలని అన్నారు. గ్రామ పెద్దలు సుధాకర్ గౌడ్, మోటె కృష్ణ, శంకర్, మాజీ వార్డ్ సభ్యులు మోటె రాములు, ఎన్.రమేష్, పాండు, వీరేశం గౌడ్, చందు, సిహెచ్.రాములు, మాజీ ఎంపీటీసీ ఎన్.శ్రీనివాస్ టీం సభ్యులను పరిచయం చేసుకొని ఆల్ ది బెస్ట్ చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రామికోత్సవ నిర్వాహన కమిటీ సభ్యులు తలారి శ్రీనివాస్, రాజు, వెంకటేష్, సంతోష్ గౌడ్, శ్రీధర్, శేఖర్ రెడ్డి, దామోదర్, మదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

–మంత్రికి వినతి పత్రం అందచేసిన చైర్మన్ యూనుస్

**జహీరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** జహీరాబాద్ మున్సిపల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి, కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకట్‌స్వామికి మున్సిపల్ చైర్మన్ మహ్మద్ యూనుస్ మున్సిపల్ కౌన్సిలర్‌లతో కలిసి వినతి పత్రం అందచేశారు. న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల్లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు వచ్చిన సందర్భంగా పట్టణంలోని ఎంపి క్యాంప్ కార్యాలయంలో మంత్రిని వివేక్ వెంకటస్వామిని మర్యాద పూర్వకంగా కలుసుకుని వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్; రాష్ట్ర సెట్విన్ కార్పోరేషన్ చైర్మన్ నందారం గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



నిధులు మంజూరు చేయాలని మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతి పత్రం అందచేస్తున్న మున్సిపల్ చైర్మన్ యండి యూనుస్

## వాసవి మాత జయంతిన భారీ బైక్ ర్యాలీ

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
జిల్లా కేంద్రం సంగారెడ్డిలో వాసవిమాత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.సంగారెడ్డి పట్టణంలో వాసవి మహా సంస్థాన్ చైర్మన్ తోపాజి అనంత కిషన్ ఆధ్వర్యంలో వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి కార్యక్రమంలో భాగంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ అతిథి గృహం నుంచి కొత్త బస్టాండ్ కలెక్టరేట్ మీదుగా పాత బస్టాండ్ నుంచి వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. జై వాసవి జై జై వాసవి.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మల రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు, లలిత సహస్ర పారాయణం చదివారు. అనంతరం అమ్మవారి పల్లకి సేవా కార్యక్రమాన్ని జరిపించారు. ఈ కార్యక్రమం లో ఆర్యవైశ్య మహిళలు, సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వాసవి మాత జయంతి సందర్భంగా నిర్వహించిన ర్యాలీ

## సంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్‌గా ప్రతీక్ జైన్

**సంగారెడ్డి బ్యూరో ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
సంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్ గా ప్రతిక్ జైన్ ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కలెక్టర్‌గా పని చేసిన ప్రావీణ్య బదిలీ అయ్యారు. సంగారెడ్డి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రతీక్ జైన్, నారాయణపేట జిల్లా కలెక్టర్ గా, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా స్థానిక సంస్థలు , కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రతీక్ జైన్‌ను రాష్ట్ర ప్రభుత్వం సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేస్తూ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే.నూతన కలెక్టర్‌గా బదిలీ అయిన ప్రతీక్ జైన్ ఆదివారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు.



సంగారెడ్డి కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రతీక్ జైన్

## సంగారెడ్డి కలెక్టరేట్‌లో వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని అధికారికంగా ప్రకటించడంతో ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వ హించారు. వాసవి మాత చిత్ర పటానికి పూల మాల వేసి ప్రత్యేక పూజలు చేశారు .కలెక్టర్ కార్యాలయం సూపరింటెండ్ విజయలక్ష్మి, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు తోపాజి అనంత కిషన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొంపల్లి విద్యాసాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పూర్ణచందర్, కార్యదర్శి నామా భాస్కర్, వాసవి మహా సంస్థాన్ కోశాధికారి జూలకంటి మల్లేశం, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ పుల్లూరి ప్రకాష్, చందా శ్రీధర్ ఇరుకుల ప్రదీప్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మ్యాడం రాధా కిషన్, జూలకంటి బుచ్చిలింగం తదితరులు పాల్గొన్నారు.



వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిలో పాల్గొన్న అధికారులు

## అంబేద్కర్ రాజ్యాంగంతోనే రాష్ట్రాల ఏర్పాటు

- మంత్రి వివేక్ వెంకటస్వామి

**జహీరాబాద్/మొగుడంపల్లి, ఏప్రిల్ 26 (ప్రభాతవార్త):**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండల పరిధిలోని గోపన్‌పల్లిలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు,గనుల శాఖ మంత్రి వివేక్ వెంకట్‌స్వామి జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, సెట్విన్ చైర్మన్ నందారం గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్‌వెంకటస్వామి మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ అందించిన సేవలను కొనియాడారు. బడుగు బలహీన వర్గాల ఉన్నతి కోసం పని చేయడమే అందరి వాడు అంబేద్కర్‌కు నిజమైన నివాళి అన్నారు. సమాజంలో మార్పు విద్య ద్వారానే సాధ్యమని అంబేద్కర్ నమ్మకం అని, విద్య వ్యాప్తి కోసం అందరూ కృషి చేయాలని అన్నారు.
దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటుకు కూడా అంబేద్కర్ కృషి చేశారని పేర్కొన్నారు.మహిళలకు 50 శాతం రిజర్వేషన్ల ఆలోచనను ముందుకు తీసుకొచ్చిన దూరదృష్టి నాయకుడు అంబేద్కర్ అని తెలిపారు. ఆయన విగ్రహాన్ని కేవలం ప్రతిమగా కాకుండా ఆదర్శంగా తీసుకుని, ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, సెట్‌విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్. గిరిధర్ రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ ఏ. చంద్రశేఖర్, టీఎస్ ఐడీసీ మాజీ చైర్మన్ ఎండి తన్వీర్, జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ ఎండి యూనుస్, సీడీసీ చైర్మన్ మొబిన్, సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, ఈశ్వర్, మండల అధ్యక్షులు బి. శ్రీనివాస్ రెడ్డి, గ్రామ నాయకులు నర్సింలు, సంగమేశ్వర్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పరిగూడెంలో పారిశుద్ధ్య లోపం

- సర్పంచ్‌పై గ్రామస్థుల ఆగ్రహం

**చౌటకూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఉప్పరిగూడెంలో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించడంతో గ్రామస్థులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలోని ఆయా వీధులలో మురుగుకాల్వలను శుభ్రం చేయించకపోతుండటంతో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు అనారోగాల బారిన పడుతున్నారు. గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రతపై గ్రామస్థులు పలు మార్లు సర్పంచ్, పంచాయితీ కార్యదర్శుల దృష్టికి తీసుకుపోయినా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రతమూలంగా చిన్నారులు, వృద్దులు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. గ్రామ సర్పంచ్, పంచాయితీ కార్యదర్శులు పట్టించుకుని గ్రామ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



ఉప్పరిగూడెంలో అపరిశుభ్రత నెలకొన్న దృశ్యం



ఆన్‌లైన్‌లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

## 2027 జనాభా లెక్కల సేకరణలో మే 10 వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవచ్చు

: జిల్లా కలెక్టర్ కె.హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** 2027 జనాభా లెక్కల సేకరణలో భాగంగా ఈనెల 26 నుంచి మే 10 వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ కె.హైమావతి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ 2027 జనాభా లెక్కల సేకరణలో భాగంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సాఫ్ట్ వేర్‌ను రూపొందించిందని దీని ద్వారా ఎవరైనా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవచ్చని తెలిపారు. వివరాల నమోదుకు 9 స్టెప్స్ ఉంటాయని హెచ్‌టిటిపి//ఎస్ఈ.ఎస్ఈఎన్ఎస్ఈఎస్.జివోవి.ఐఎన్ పోర్టల్‌లో లాగిన్ అయి కుటుంబ వివరాలను అలాగే సాఫ్ట్వేర్ అడిగే 33 ప్రశ్నలకు సమాధానం నమోదు చేయాలన్నారు. అనంతరం సాఫ్ట్వేర్ ఇచ్చే ఎస్ఈ ఐడి స్క్రీన్ షాట్ చేసి పెట్టుకుంటే జనాభా లెక్కల కోసం ఇంటికి వచ్చే జనాభా లెక్కల అధికారులకు ఎస్ఈ ఐడి చూపిస్తే జనాభా లెక్కల నమోదు ప్రక్రియలో వివరాలను అమోదిస్తారని ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మే 10 వరకు ఎవరికి వారు సాఫ్ట్వేర్‌ని ఉపయోగించి మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ లేదా ఇంటర్‌నెట్ అవకాశం ఉన్న దేని ద్వారానైనా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవాలని ఆమె సూచించారు.

## మండల పరిషత్ కార్యాలయ భవనాల నిర్మాణాలకు 3.80కోట్లు

-మంత్రి దామోదర్ రాజనర్సింహా చొరవతో నిధులు మంజూరు





తాత్కాలిక భవనంలో కొనసాగుతున్న మండల పరిషత్ కార్యాలయం దృశ్యం

**చౌటకూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** అందోలు నియోజకవర్గంలోని చౌటకూరు, వట్‌పల్లి మండలాలకు మండల పరిషత్ కార్యాలయాల నిర్మాణాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా చొరవతో 3.80కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి. 2016లో ఏర్పాటైన వట్‌పల్లి, 2020లో చౌటకూరు మండలాలు ఏర్పాటు అయ్యాయి. ప్రత్యేకంగా ఏర్పాటైన మండ పరిషత్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిచేందుకు పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి (భవనాలు) శాఖ జీఓఆరర్‌టీ 237 ద్వార ఉత్తర్వులు విడుదల చేశారు. ఒక్కో భవనానికి కోటి 90 లక్షల రూపాయల చొప్పున 3.80 కోట్ల రూపాయలు భవనాల నిర్మాణాలు నిర్మించనున్నారు. మండల పరిషత్ కార్యాలయాలకు స్వంత భవనాలు మంజూరు చేయించిన రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహాకు ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



మున్సిపాలిటీ కార్యాలయంలో మాట్లాడుతున్న చైర్మన్ కుమార్ గౌడ్

## అభివృద్ధికి అడ్డువస్తే ఉపేక్షించం

- మున్సిపల్ చైర్మన్ చిన్న పాపని కుమార్ గౌడ్ హెచ్చరిక

**గుమ్మడిదల, ఏప్రిల్ 26, ప్రభాత వార్త:** గుమ్మడిదల మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చిన్న పాపని కుమార్ గౌడ్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులు, కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎవరైనా అడ్డుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.మున్సిపాలిటీ నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు సి.ఎస్.ఆర్, ఎమ్మెల్యే నిధులను వినియోగించి సమగ్ర అభివృద్ధి చేపడతామని తెలిపారు. ఏ విధమైన నిధుల వినియోగానికైనా ఎవరైనా అడ్డుపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఇక కొంతమంది రాజకీయ నాయకులు తమ స్వలాభం కోసం పిచ్చి పిచ్చి ఆలోచనలు మానుకోవాలని సూచించారు. అభివృద్ధిని అడ్డుకునే విధంగా వ్యవహరించడం ప్రజలకు నష్టం కలిగించే చర్యలేనని ఆయన మండిపడ్డారు.ప్రజల సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, దీనికి విఘాతం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు.ప్రజల కోసం చేపడుతున్న పనులకు అడ్డంకులు సృష్టిస్తే ఎంతటి వారినైనా కఠినంగా ఎదుర్కొంటాం" అని స్పష్టం చేశారు.అధికారులు, సిబ్బంది సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచిస్తూ, మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధి, శుభ్రత, రోడ్లు, డ్రైనేజీ పనులు ప్రాధాన్యతగా కొనసాగుతున్నాయని, ప్రజల సహకారంతో మరింత అభివృద్ధి సాధిస్తామని తెలిపారు.

## మండల అభివృద్ధికి మంత్రిని కలిసిన నాయకులు



జిల్లా మంత్రి వివేక్‌తో నాయకులు

**కోల్చారం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ ను కాంగ్రెస్ నాయకులు, అప్పాజిపల్లి సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ గజిని, మెదక్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పుల్లబోయిన దుర్గేష్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా, వారు మండల అభివృద్ధి పనులపై మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి వివేక్ వెంకటస్వామి ఈ ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించి, సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని హామీ ఇచ్చారు.అంతేకాకుండా, ఇటీవల మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియామకం అయిన పుల్లబోయిన దుర్గేష్ ముదిరాజ్ ని మంత్రి అభినందించారు. ఆయనను కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు .

## సెలవుల్లో పిల్లలు జాగ్రత్త

**నార్సింగి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో విద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని నార్సింగి మండల ఎస్సై సృజన అన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించడంతో, సెలవులు పిల్లలకు ఆటవిడుపుగా మారాయని గ్రామాల్లో చాలా వరకు యువత, పిల్లలు బావులు, కుంటలు చెరువుల్లో ఈతకు వెళ్తుంటారని, కొత్తగా ఈత నేర్చుకోవాలన్నా ఉష్ణోగ్రత వేడి నుంచి ఉపశమనం పొందేందుకు వాగు లు చెరువుల్లో ఈత కొట్టాలన్న ఉత్సాహంతో ఉన్న పిల్లలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా నీటిలోకి దిగితే ప్రమాదాల బారినపడే అవకాశం ఉందన్నారు. ఈతకొట్టడంపై పిల్లలకు పెద్దగా అవగాహన ఉండదని అలాంటి సమయంలో ఎక్కువగా ప్రమాదాలకు గురవు తుంటారని గుర్తు చేశారు. గ్రామాల్లో ఈతరాని పిల్లలు ఏమాత్రం అజా గ్రత్తగా ఉన్నా నీటిలో మునిగిప్రాణాలు కోల్పోయే ప్రమాదముందని తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇదిలా ఉండగా వేసవి సెలవుల్లో విద్యార్థులు ఖాళీ సమయాల్లో ఎక్కువగా మొబైల్ వినియోగం తగ్గించేందుకు తల్లిదండ్రులు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు మొబైల్ ప్రమాదం పొంచి ఉందని తల్లిదండ్రులు వేసవి కాలంలో ప్రత్యేకంగా స్పెషల్ కోర్సుల శిక్షణలకు పంపించడం మంచిది అన్నారు. ఏది ఏమైనా ఏప్రిల్ 24 నుండి జూన్ 13 వరకు 50 రోజుల పాటుగా పిల్లలను క్రమశిక్షణతో ప్రోత్సహించి సన్మార్గంలో నడిపించేలా బాధ్యతగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులను కోరారు.


నార్సింగి ఎస్ఐ సృజన

## కాంగ్రెస్ పార్టీ మహిళా బిల్లును అడ్డుకోవడం దురదృష్టకరం

**బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్...**


రామాయంపేట మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్

**రామాయంపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** పార్లమెంటులో ప్రవేశపెట్టి మహిళాబిల్లును కాంగ్రెస్ పార్టీ అడ్డుకోవడం దురదృష్టకరమని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. ఆదివారం నాడు రామాయంపేటలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి పలు రాజకీయ అంశాలపై స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ పార్టీతో పాటు దాని మిత్రపక్షాలు అడ్డుకోవడం చాలా బాధాకరమని, దీనిని బిజెపి తీవ్రంగా ఖండిస్తున్నదని తెలిపారు.

డిలిమిటేషన్ ప్రక్రియపై అనవసరంగా అపోహలు సృష్టిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నదని విమర్శించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా సీట్ల సంఖ్యను 50 శాతం వరకు పెంచేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, దీనిని అడ్డుకోవడం సరైంది కాదన్నారు. తెలంగాణకు 10 నుంచి 12 పార్లమెంట్ సీట్లు, 60 నుంచి 70 ఎమ్మెల్యే సీట్లు పెరిగే అవకాశం ఉండేదని, మహిళా రిజర్వేషన్ ద్వారా సుమారు 65 మంది మహిళలు అసెంబ్లీలోకి వచ్చే అవకాశాన్ని కాంగ్రెస్ దెబ్బతీసిందని ఆరోపించారు.

రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో మహిళా బిల్లుతో పాటు డిలిమిటేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం మళ్లీ ప్రవేశపెడుతుందని, అవి ఖచ్చితంగా ఆమోదం పొందుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ ద్వారా మెదక్ జిల్లాలో రెండు నుంచి మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఏర్పడే అవకాశముందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ శంకర్ గౌడ్, మండల అధ్యక్షుడు నవీన్, పబ్బ సత్యనారాయణ, తదితర నాయకులు పాల్గొన్నారు.

## రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

**ఎఎంసి చైర్మన్ యాదగిరి**


వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎఎంసి చైర్మన్ యాదగిరి

**నంగునూర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** రైతుల సౌకర్యార్థం మండల పరిధిలోని అన్ని గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని ఎఎంసి చైర్మన్ దేవులపల్లి యాదగిరి అన్నారు. మండల పరిధిలోని బద్దిపడగ గ్రామంలో పాలమాకుల పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రానినన ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధరను పొందాలన్నారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ సర్కార్ కృతనిశ్చయంతో పని చేస్తుందని రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధరను చెల్లిస్తుందన్నారు. సన్న రకం వరి ధాన్యానికి ప్రభుత్వం అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంద లక్ష్మీ రాజు, ఉప సర్పంచ్ రేపాక రాజేందర్, పంచాయతీ కార్యదర్శి రాజు నాయక్, ఎఎంసి వైస్ చైర్మన్ పవన్, డైరెక్టర్లు రాజేశ్వర్, రమేష్, ఐలయ్య, అశోక్‌గౌడ్, రంగారెడ్డి, జీవన్ నాయక్, నాగరాజు, రమేష్, బాబు, తిరుపతి, రాజశేఖర్‌రెడ్డి, లాలు నాయక్, పిఏసిఎస్ కార్యదర్శి రాజేందర్, పార్టీ నాయకులు తప్పేట శంకర్, సత్తయ్య, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పది రోజుల్లోనే చోరీ ఫోన్ రికవరీ

**కొల్చారం పోలీసుల సూపర్ పనితీరు**

కొల్చారం ,ఏప్రిల్ 26, ప్రభాతవార్త :కొల్చారం పోలీసు స్టేషన్ సిబ్బంది తమ సమర్థతను మరోసారి నిరూపించారు. చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను కేవలం పది రోజుల్లోనే రికవరీ చేసి యజమానికి అప్పగించడం ద్వారా వారు సేవల కేటాయింపులో అనుభవాన్ని ప్రదర్శించారు. అప్పాజీ పల్లి గ్రామానికి చెందిన తిమ్మకపల్లి గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వెంటనే స్పందించారు. కేసు నమోదు చేసి, సాంకేతిక ఆధారాలను ఉపయోగించి వేగంగా దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఫోన్‌ను ఉపయోగిస్తున్న వ్యక్తిని గుర్తించి పట్టుకుని, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. తరువాత ఆ ఫోన్‌ను అసలు యజమానికి ఏ ఎస్ ఐ సుధాకర్ చేతుల మీదుగా అప్పగించారు. ప్రజలు, స్థానికులు పోలీసుల చురుకైన చర్యలపై ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా,"మొబైల్ పోయిన వెంటనే ఫిర్యాదు చేస్తే, త్వరగా రికవరీ చేయడం సులభం అవుతుంది" అని పోలీసులు ప్రజలకు సూచించారు.



## త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

**నర్సాపూర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :**

నర్సాపూర్ పట్టణంలోని బస్టాండ్ లో బస్సును బోర్‌వెల్ లారీ ఢీకొన్న సంఘటనలో ఎవ్వరికి ఏమి ప్రమాదం జరుగలేదు అంతా సురక్షితంగా ఉండటంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. నర్సాపూర్ బస్టాండ్ లోకి గజ్వేల్ డిపోకు చెందిన బస్సు ఇన్‌గేట్ నుండి బస్టాండ్ లోకి వెళుతుంది.

ఈ క్రమంలో హైద్రాబాద్ నుండి ఓ బోర్‌వెల్ లారీ వచ్చి ఈ బస్సును ఢీ కొట్టింది, దీంతో బస్సు కొంతం బాగం ధ్వంసం అయ్యింది. ఈ ప్రమాదంలో ఒక మహిళకు స్వల్ప గాయాలు తప్ప మిగతా ప్రయాణీకులంతా సురక్షితంగా క్షేమంగా బయట పడ్డారు దీంతో ప్రయాణీకులంతా ఒక్కసారి ఊపిరి పీల్చు కున్నారు ఎవ్వరికి ఏమి ప్రమాదం జరుగక పోవడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది.

ఈ సంఘటనతో బస్టాండ్ ప్రాంతమంతా ట్రాఫిక్‌తో నిండిపోగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.


నర్సాపూర్ పట్టణంలోని బస్టాండ్‌లో బస్సును బోర్‌వెల్ లారీ ఢీకొన్న దృశ్యం

# అభివృద్దిలో దూసుకుపోతున్న చౌటకూరు


తహసిల్దార్ అదనపు గదిని ప్రారంభిస్తున్న సర్పంచ్ పార్కల రామ్‌రెడ్డి


గ్రామంలో సింగిల్ ఫేస్ మోటారును ప్రారంభిస్తున్న కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు రామగౌడ్


గ్రామ కూడలిలో హైమాస్ లైట్ అమర్చిన దృశ్యం


బోరును ప్రారంభిస్తున్న మాజీ ఎంపిపి అధ్యక్షులు సుభాష్‌రెడ్డి

**చౌటకూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరు గ్రామం గ్రామ సర్పంచ్ పార్కల రాంరెడ్డి నాయకత్వంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. గ్రామంలో మౌలిక సదుపాయాలల విస్తరణకుఉ ప్రాధాన్యం ఇత్తు పలు వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. గ్రామ భద్రతను బలోపేతం చేసేందుకు 70 సిసి కెమెరాలను ఏర్పాటు చేయగా, తాగునీటి సమస్య పరిష్కారానికి 6 బోర్లు తవ్వించారు. గ్రామంలోని ఆయా వీధులలో ఎల్ఈడి బల్బులు అమర్చడంతో రాత్రిళ్ల ప్రకాశవంతంగా మారాయి. ప్రధాన కూడళ్లలో నాలుగు ఐమాక్స్ వీధి దీపాలను ఏర్పాటు చేసి చీకటిని పారద్రోలారు. అంగన్‌వాడి కేందాలను సరికొత్త రూపంలో అభివృద్ధి చేసి ప్రతి కేంద్రం వద్ద మరుగుదొడ్లు నిర్మించడంతో చిన్నారులు, మహిళలకు సౌకర్యాలు కల్గాయని చెప్పవచ్చు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేయడం ద్వార ప్రమాదాలను నివారించే చర్యలు తీసుకున్నారు. అంతర్గత రహదారులను మెరుగుపరచడం, కాలువల నిర్మాణం, చెత్త నిర్వహణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పచ్చధనాన్ని పెంపొందించేందుకు గ్రామంలో మొక్కలు నాటడం, పార్కుల అభివృద్ధి లాంటి నులు సైతం చేపట్టారు. గ్రామ ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ కోసం శుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్నారు. విద్యా రంగాన్ని ప్రోత్సాహిస్తూ పాఠశాలల అభివృద్ధికి కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రజల సహకారంతో పారిదర్శక పాలనతో ముందుకు సాగుతున్న సర్పంచ్ పార్కల రాంరెడ్డి నాయకత్వం గ్రామానికి ఆదర్శంగా నిలుస్తోంది. గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పరిసర పంచాయితీలకు ఆదర్శంగా నిలుస్తోందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

# 100 గిరిజన తండాల్లో ఉచిత వైద్య శిబిరాలు

**-రాజారాం తండాలో శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే**

**కంగ్టి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని 100 గిరిజన తండాల్లో సహార హెల్త్ డెవలప్‌మెంట్ సొసైటీ (సిఎస్ఆర్) ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ఆదివారం మండల పరిధిలోని రాజారాం తండాలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ తండాల్లోని చిట్టచివరి గిరిజన బిడ్డకు వైద్య సేవలు అందించేందుకు లాస్ట్ మైల్ రీచ్ ద్వార మారుమూల గిరిజన తండాల్లో శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. సహార హెల్త్ డెవలప్‌మెంగ్ సొసైటీ వారు తమ సిఎస్ఆర్ నిధులతో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం గర్వంగా ఉందన్నారు. 100 గిరిజన తండాల్లో శిబిరాల ఏర్పాటుతో నిరంత ఆరోగ్య పర్యవేక్షణ జరుగుతుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ముఖ్యమన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించి మందులను పంపిణి చేయడమే కాకుండా దీర్ఘకాలక రోగాల గుర్తింపు, గర్భిణీ స్త్రీలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిని సారించనున్నారన్నారు. సుస్థితర ఆరోగ్యానికి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సహార హెల్త్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులు, సహారా గ్రూప్ డైరెక్టర్ శంకరమఠం రఘురామ్, సర్పంచ్ మణారామ్, మాజీ సర్పంచ్ ఖిరు నాయక్ పల్లవి పర్సు రామ్, మాజీ ఎంపిటిసి సభ్యులు గంగారాం, మాజీ ఎంపిపి అధ్యక్షులు మాధవరావ్ పటేల్, పంచాయితీ కార్యదర్శి రాజు పవార్, రాజారాం తండా వాసులు పాల్గొన్నారు.


రాజారాం తండాలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


అన్నదానం చేస్తున్న దృశ్యం

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్వీఎన్ఎస్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆహారం పంపిణీ

**పటాన్ చెరు:ఏప్రిల్ 26,ప్రభాత వార్త :**సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా ఆర్వీఎన్ఎస్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పటాన్ చెరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఆహారం పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేద రోగులు, వారి బంధువులకు ఉచితంగా భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్లు రవి, సుదర్శన్, చైర్మన్ నడిమింటి కృష్ణ, వైస్ చైర్మన్ సౌమ్య, జనరల్ సెక్రటరీ రాజు పాల్గొని స్వయంగా భోజనం వడ్డించారు. అవసరంలో ఉన్న వారికి సహాయం చేయడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు, లబ్ధిదారులు ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని ఫౌండేషన్ సభ్యులు వెల్లడించారు.

## తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజ్ గోపాల్ యాదవ్

**పటాన్ చెరు:ఏప్రిల్ 26,ప్రభాత వార్త :** తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ డాక్టర్ జనక్ ప్రసాద్ చేతుల మీదుగా పటాన్ చెరు పట్టణానికి చెందిన రాజ్ గోపాల్ యాదవ్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియ మిస్తూ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజ్ గోపాల్ యాదవ్ మాట్లాడుతూ.. తనపై విశ్వాసాన్ని ఉంచి ఈ బాధ్యతలు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు ఉద్యోగుల హక్కుల సాధన కోసం, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తాను నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా జనక్ ప్రసాద్ మాట్లాడుతూ.. కార్మికులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఎప్పుడు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి బోర్డు మెంబర్ రాజు ముదిరాజ్, కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



## ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించిన టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, ఏప్రిల్ 26 (ప్రభాతవార్త):**

సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డుపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనం నుంచి కిందపడిపోయి గాయపడ్డాడు. అదే మార్గంలో వెళ్తున్న టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ఈ ఘటనను గమనించి వెంటనే స్పందించారు. ఆమె వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, గాయపడిన వ్యక్తిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలా చర్యలు చేపట్టారు. నిర్మల జగ్గారెడ్డి చూపిన మానవత్వానికి అక్కడి స్థానికులు ప్రశంసలు వ్యక్తం చేశారు.

## చౌటకూరులో ముగిసిన రేణుక ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు

**చౌటకూరు,ఏప్రిల్ 26 (ప్రభాతవార్త):**

సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండల కేంద్రంలోని వెలసిన రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ నాలుగవ వార్షికోత్సవాలు ఆదివారం ముగిసాయి. రెండు రోజులుగా అంగరంగా వైభవంగా వార్షికోత్సవ వేడుకలు జరిగాయి . ముగింపు రోజైన ఆదివారం రేణుక ఎల్లమ్మ తల్లి జమదగ్ని మహర్షి కళ్యాణోత్సవం కన్నుల పం దువల సాగింది. స్థానిక గౌడ సంఘం అధ్వర్యంలో సాయంత్రం వేళ పెద్ద ఎత్తున బోనాల ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన వితరణ చేపట్టారు. ఉత్సవాలనుతిలకించేం దుకు పోసానిపల్లి, సరాప్పల్లి, సుల్తాన్పూర్, ఉప్పరిగూడెం, కోర్పోలు తదితర గ్రామాల నుండి భక్తులు తరలివచ్చారు. ఉత్సవాలకు రాష్ట్ర ట్రేడ్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి, ఎంపీపీ మాజీ అధ్యక్షుడు భూంరెడ్డి సుభాష్ రెడ్డి, జోగిపేట ఏఎంసీ మాజీ చైర్మన్ గంగా జోగినాథ్, సర్పం చ్ పార్కల రాంరెడ్డిలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు

## అంబేద్కం సంఘం అధ్యక్షులుగా పొట్టపల్లి లక్ష్మణ్

**బెజ్జంకి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :**



బెజ్జంకి అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులుగా పొట్టపల్లి లక్ష్మణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా లింగాల రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బోనగిరి లింగం, సహాయ కార్యదర్శిగా జేరిపోతుల రవి, కోశాధికారిగా జంగిటి భీమయ్యలను ఎన్నుకున్నారు. అనంతరం బెజ్జంకి అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనా లక్ష్మణ్‌ను శాలువాతో ఘనంగా సత్కారించారు. ఈసందర్భంగా గ్రామ పెద్దకు, యువజన నాయకులకు లక్ష్మణ్ కృతజ్ఞతలు తెలిపారు.

## దాచారంలో మెగా ఉచిత దంత వైద్య శిబిరం

**బెజ్జంకి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :**



మండల పరిధిలోని దాచారం గ్రామ సర్పంచ్ బైర మానస రాజేందర్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీనివాస సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల సిద్దిపేట సౌజన్యంతో రైతు వేదికలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎల్.శ్రీనివాస్, డాక్టర్ మిన్హాజ్ ఫిర్దాస్‌లు శిబిరంలో పన్ను నొప్పి, పుచ్చు పళ్ళు, చిగుళ్ళ వాపు,పిల్లల దంత సమస్యలు, వంకర పళ్ళకు క్లిప్స్ వంటి పలు సమస్యలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒక సారి దంత పరీక్ష చేయించుకోవాలని సూచించారు. సర్పంచ్ బైరి మానస రాజేందర్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దీటి బాలనర్సు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### 28న గ్రామ పంచాయతీ దుకాణ సముదాయాలకు వేలం

**బెజ్జంకి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :**

బెజ్జంకి మండల కేంద్రంలోని పంచాయతీ దుకాణ సముదాయాలకు పాతవి,కొత్త దుకాణా సముదాయాలను 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ ఈనెల 28న ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం వేయడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.3500 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని వేలంలో పాల్గొనే వారు గ్రామ పంచాయతీకి ఎలాంటి బకాయిలు ఉండరాదన్నారు.

## విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను ఛేదించాలి

**ఎం ఎస్ ఎం ఈ జాయింట్ డైరెక్టర్ హైదరాబాద్ శేషగిరిరావు**

**నర్సాపూర్ ఏప్రిల్ 26, ప్రభాతవార్త :**

విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను ఎన్నిఆటంకాలు ఎదురైనా ఛేదించాలని ఈ మేరకు ఎల్లప్పుడు నూతన ప్రయోగాలపై దృష్టి సాధించాలని ఎంఎస్ ఎంఈ హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ శివ శేషగిరి రావు అన్నారు. నర్సాపూర్ లోని వైపర్ ఫార్మసీ కళాశాలలో శనివారం రాత్రి 19వ "వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎం ఎస్ ఎం ఈ హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ శివ శేషగిరిరావు, బయోలాజికల్ ఈ లిమిటెడ్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రేణుక దాట్ల హాజరు కాగా ఎం ఎస్ ఎం ఈ అసిస్టెంట్ డైరెక్టర్ నవీన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి శివ శేషగిరిరావు గారు మాట్లాడుతూ యువత యొక్క ప్రాముఖ్యతను గురించి వివరిస్తూ దేశ అభివృద్ధిలో యువకులదే కీలక పాత్ర ఉంటుందని అన్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా వాటిని అధిగమించి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని ఆయన విద్యార్థులకు సూచించారు . అనంతరం రేణుక దాట్ల మాట్లాడుతూ రాబోయే కాలంలో ఔషధ రంగంలో బయోలాజికల్ డోసేజ్ ఫార్మ్స్ అత్యధిక ప్రాధాన్యత వహిస్తుందని తెలిపారు. విద్యార్థులు ప్రయోగాలపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. అంతేగాక విష్ణు విద్యాసంస్థల సెక్రటరీ ఆదిత్య విస్సం మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీ యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ ఆరోగ్యకరమైన మంచి వాతావరణంలో తమ కళాశాలలు ఉన్నాయని పేర్కొన్నారు.

## మేడేను జయప్రదం చేయండి

**చౌటకూరు,ఏప్రిల్ 26 (ప్రభాతవార్త):**

మే డే ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.ఏ. రెహమాన్ కోరారు. మే డేను పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లాపుల్కల్లో ఆదివారం పోస్టర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఅమెరికాలోని చికాగో నగరంలో 1886 మే 1వ తేదీన పని గంటలు తగ్గించాలని, పని ప్రదేశాల్లో కార్మికులకు భద్రతా కల్పించి, కార్మికుల కనీస వేతనాలు చెల్లించాలని, కార్మికులపై యజమాన్యాల వేధింపులు అరిగట్టాలని 1886లో మహత్తరమైన పోరాటంజరిగిందన్నారు. ఆ పోరాటంలో అనేక మంది కార్మికులు తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రాణాలర్పించారని గుర్తు చేశారు. ఆ నెత్తుటి మరకల బట్టలతోనే కార్మికుల ఎర్ర జెండా ఏర్పడిందని. ఆనాటి నుండి నేటి వరకు ఎర్రజెండా చేతబట్టి కార్మికుల పోరాటాలు నిర్వహించి హక్కులను సాధించుకుంటున్నారని పేర్కొన్నారు. నేటి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలలో నుండి గుండెకాయ లాంటి 29 చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్లను తెచ్చిందని ఆరోపించారు. ఈ కోడ్ల వల్ల కార్మికుల పని గంటలకు 8 గంటల నుండి 12 గంటలకు పెంచి సమ్మె హక్కును తొలగించేందుకు కేంద్రం కుట్రలు చేస్తుందని ఆరోపించారు.


సిర్గాపూర్‌లో మేకల బజార్

## సిర్గాపూర్‌లో మేకల బజార్ ప్రారంభం

**-తొలిరోజే భారీ వ్యాపారం**

**సిర్గాపూర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో తొలిమారు మేకల బజార్‌ను ప్రారంభించారు. గ్రామంలో నిర్వహించిన మేకల బజార్‌లో 140 మేకలు, గొర్రెల క్రయ విక్రయాలు కొనసాగాయి. అత్యధికంగా ఒక మేక 20వేల రూపాయలకు అమ్ముడవగా మితగా మేకలు సరాసరి 12వేల రూపాయలకు అమ్ముడు పోయాయి. బజార్‌ను ప్రారంభించిన తొలిరోజే 17లక్షల వరకు వ్యాపారం జరిగినట్లు తెలుస్తోంది. ప్రతి ఆదివారం గ్రామంలో మేకల బజార్‌ను నిర్వహించనున్నట్లు, వ్యాపారులు బజార్‌ను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ పంచాయితీ సూచించింది.

## నేడు నుండి రైతు ముంగిట్లో శాస్త్రవేతల ప్రోగ్రాం

**కోల్చారం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** సోమవారం నుంచి మండల వ్యాప్తంగా రైతు ముంగిట్లో శాస్త్రవేతల ప్రోగ్రాం ప్రారంభం అవుతోంది. ఈ కార్యక్రమం యూనివర్సిటీ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో నిర్వహించబడనుందనీ మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. రైతులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని శాస్త్రవేతల సలహాలు, సూచనల ఆధారంగా అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ప్రథమంగా సోమవారం రోజున పోతాన్ శెట్టిపల్లి గ్రామంలో ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవు తుందనీ. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు.

## సృజన హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం

**ఫయాజ్ షరీఫ్**



**గుమ్మడిదల,ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామంలో సృజన హాస్పిటల్ వారు సౌజన్యంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం పెద్ద ఎత్తున జరిగింది. ఈ శిబిరాన్ని సృజన హాస్పిటల్ చైర్మన్ ఫయాజ్ షరీఫ్ మ కొరివి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరం ప్రారంభోత్సవం వైద్య సేవలు అందించే అత్యుత్తమ అవకాశంగా నిలిచింది. గ్రామ సర్పంచ్ కొరివి రాణి రిబ్బన్ కట్ చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలు, నిరుపేదలు ఈ ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు."వైద్య సేవలు పొందేందుకు ఆసుపత్రులకు వెళ్లడం వలన భారీ ఖర్చులు వస్తుంటాయి. ఈ ఉచిత వైద్య శిబిరం ద్వారా గ్రామస్థులు అంగీకారం లేకుండా, సహాయం పొందగలుగుతారు" అని సర్పంచ్ వ్యాఖ్యానించారు. ఉచిత వైద్య శిబిరం కోసం సృజన హాస్పిటల్ బొంతపల్లి వారు వారి సౌజన్యంతో సహకారం అందించినందుకు ఉపసర్పంచ్ పోచయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోచయ్య, వార్డ్ సభ్యులు ఆంజనేయులు, దానోళ్ల సాయిలు, నాయకులు బొడ్డు కృష్ణ, కమ్మరి భాస్కర్, హాస్పిటల్ డాక్టర్ అన్వార్ అహ్మద్, డాక్టర్ సాయి కుమార్, హాస్పిటల్ చైర్మన్ ఎండి ఫయాజ్ షరీఫ్, సయ్యద్ అన్వర్ గ్రామస్థులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ దయామయ చర్యలు

**జాకీర్ అభిప్రాయం**

**కొండాపూర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :**మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో, కాంగ్రెస్ మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు జాకీర్, ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇచ్చిన ఘనతను ప్రస్తావించారు. "ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడం, ఆర్టీసీ కార్మికుల ఆనందాన్ని పెంచింది. ఈ ఘనత పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వానిదే," అని జాకీర్ పేర్కొన్నారు.

బిఆర్ఎస్ పార్టీ ఈ అంశంపై మాట్లాడే అర్హత లేకుండా ఉందని, ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించడం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్టీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్లు ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నారని ఆయన వివరించారు. ఈ చర్యలు, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికి, 11 శాతం పిఆర్సీ ప్రకటించడం వంటి చర్యలు కార్మికుల ఆర్థిక ఇబ్బందులను తీర్చడంలో సహాయపడతాయని చెప్పారు.

జాకీర్, "ఈ నిర్ణయాలు ఆర్టీసీ కార్మికుల కోసం ఒక శుభవార్తగా మారాయి. వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించింది" అని అభిప్రాయపడతారు.

ఈ సందర్భంగా, ఆయన ఆర్టీసీ కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు.


కౌడిపల్లి అభయ రామాలయంలో వాసవి కన్యక పరమేశ్వరీ మాతా జయంతి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేస్తున్న ఆర్యవైశ్య సంఘం

## ఘనంగా వాసవి కన్యక పరమేశ్వరీ జయంతి

**కౌడిపల్లి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** ఆర్యవైశ్యుల కుల దైవం, ఆరాధ్య దైవం వాసవి కన్యకా పరమేశ్వరీ మాతా జయంతిని పురస్కరించుకొని ఆదివారం నాడు కౌడిపల్లి అభయ రామాలయంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కౌడా శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో మాతా జయంతి మహోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. అభయ రామాలయంలో వాసవి కన్యకా పరమేశ్వరీ మాతా చిత్ర పటానికి గజమాలను వేసి, ఆలయ ప్రధాన అర్చకుడు ఫణీంద్ర శర్మ వేద మంత్రాల ప్రత్యేక పూజుల నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కౌడా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాసవి కన్యకా పరమేశ్వరీ మాతా జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం పట్ల సిఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేశారు. ఆర్యవైశ్యల ఆత్మగౌరవంను కాపాడి ప్రత్యేకంగా మనలను గుర్తించిన రేవంత్ రెడ్డికి రుణపడి ఉంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఈయన తోపాటు ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు ఉడుత వెంకటేశం గుప్తా, ఉడుత మురళి గుప్తా, బాలకిషన్ గుప్తా,ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరలు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన తునికి నల్లపోచమ్మ ఆలయం

**కౌడిపల్లి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** జిల్లాలలోనే రెండవ అతి పెద్ద జాతరగా పేరుగాంచిన తునికి నల్ల పోచమ్మ ఆలయం ఆది వారం నాడు భక్తులతో కిటకిటలాడిపోయింది. ఉదయం నుండియే భక్తుల తాకిడి పెరుగుతూ వచ్చింది. తునికి నల్ల పోచమ్మ ఆలయ ఇంచార్జి ఈవో రంగరావు, అభివృద్ధి కమీటి చైర్మెన్ తాళ్ల శ్రీనివాస్ రెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన పూజారి శివప్ప వేదమంత్రాల నడుమ అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత భక్తులకు దర్శనాలను కల్పించారు. భక్తులు శివ సత్తుల శిగాలు, డప్పు చప్పుల దరువుల నడుమ అమ్మవారికి బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన తర్వాత అమ్మ వారి ఎదుట బోనం నైవే ద్యాలను పెట్టి తమ మొక్కు లు తీర్చుకున్నారు. అనంత ౦రం గర్భగుడిలో అమ్మవారి దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించి, అమ్మ ఆశీర్వాచనం పొందారు. కొంతమంది భక్తులు తమ కోరికలు తీర్చిన నల్లపోచమ్మ తల్లికి ఒడి బియ్యం సమర్పించి, జంతుబలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంవద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయం సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకుంటు న్నారు. వేసవి ఎండ తీవ్రత రూపం దాల్చుతున్న సందర్భంలో ఆలయంకు విచ్చేసే భక్తులకు త్రాగునీటి సమస్య రాకుండా ఆలయ అభివృద్ధి కమీటీ సభ్యులు, ఆలయసిబ్బందితో మౌళిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు ఈవో తెలిపారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమకు తోచినంత విరా ళాలు ఇస్తే భక్తులకు సౌకర్యార్థం కాటేజ్‌లు నిర్మించ బడుతాయని ఇంచార్జి ఈవో రంగారావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వీరితో పాటు గ్రామ సర్పం చ్ ధనలక్ష్మి శేఖర్, ఉప సర్పంచ్ మధుసూధన్ గౌడ్, ఆలయం జూనియర్ అసిస్టెంట్ వెంకట్ రెడ్డి, ఆలయ పూజారి రాజేశ్వర్, విజ్ఞేష్ అప్ప, గ్రామ పెద్దలు సాయా గౌడు, శంకర్, శేఖర్, చల్ల మల్లేశం, అభివృద్ధి కమీటి సభ్యులు పర్వతాలు, హన్మాల రాములు, దుర్గయ్య, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


తునికి నల్ల పోచమ్మకి ప్రత్యేక పూజలు చేసి భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటున్న దృశ్యం.


ఏడుపాయల వనదుర్గ

అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లలో భక్తులు

## ఏడుపాయలలో భక్తుల సందడి

**భారీగా తరలి వచ్చిన భక్తులు...**

**బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కల చెల్లింపులు...**

**పాపన్నపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** భక్తుల కోరికలు తీర్చే తల్లిగా పేరు గాంచిన ఏడుపాయల వనదుర్గ భవానీ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది .వేసవి సెలవులు, ఆదివారం సెలవు దినాలు కావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో పుణ్యక్షేత్రం కిటకిటలాడింది. సుదూర ప్రాంతాలనుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. వీరు మంజీరా నదిలోని వివిధ పాయల్లో పుణ్యస్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు , బోనాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఇఒ వీరేశం , తమ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి,బ్రహ్మచారి, బత్తినిరాజు, నర్సింలు, వరుణాచారి, యాదగిరి మహేష్ ,నరేష్, దీపక్, తదితరులు ఏర్పాటు చేయగా వేదపండితులు శంకర శర్మ, పార్థివ శర్మ ,రాము , శేఖర్ నాగరాజు తదితరులు పూజలు నిర్వహించారు, ఏడుపాయలలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తమ సిబ్బందితో ప్రత్యేక బందో బస్త్ చర్యలు చేపట్టారు.

## అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రజలపై ఎల్లప్పుడు ఉండాలి

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి కరుణ కటాక్షాలు సిద్ధిపేట నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడు ఉండాలని..ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు సమాజంలో ఐక్యతను, స్నేహ భావాన్ని మరింత బలపరుస్తాయని వంగ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య భవ నంలో ఆదివారం వాసవి కన్యకా పరమేశ్వరి మాతజయంతోత్స వాలు అంగరంగవైభవంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి మాట్లాడారు.అమ్మవారి ఆశీస్సులు ప్రజల అనందానికి మార్గదర్శకం అన్నారు. అమ్మవారి ఆశీస్సులు ఉంటే ప్రజల జీవితాల్లో ఆనందమేనని తెలిపారు. అనంతరం వంగ రాజేశ్వర్‌రెడ్డికి అమ్మవారి చిత్ర పటం అందజేసి ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య భవనం కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


వాసవి కన్యకా పరమేశ్వరి మాత చిత్ర పటాన్ని అందజేస్తున్న దృశ్యం

# అంగరంగ వైభవంగా వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :**

జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో ఆర్యవైశ్యుల సమక్షంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. లోక కల్యాణం కోసం కులమతాలకు అతీతంగా శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని కోరుతూ వేడుకలను నిర్వహించారు. ఉదయం వేకువజామునే గోపూజతో కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం భక్తిశ్రద్దలతో అర్యవైశ భవనం కమిటీ వారి చేతుల మీదుగా అమ్మవారి పతాక ఆవిష్కరణ చేశారు. 102 కలశాలతో పంచామృతాలు, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అమ్మవారికి శాస్త్రోకనతంగా అభిషేకం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమ పూజలు, మూలమంత్ర హవనంలో పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి వాసవి, వనతి క్లబ్స్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చీర, సారె అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య భవనం అధ్యక్షులు బాలరాజేశం, ప్రధాన కార్యదర్శి పోశెట్టి శ్రీకాంత్, కోశాధికారి గంప కృష్ణమూర్తి, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, రవి, రాజేశం, దామోదర్, గంప శ్రీనివాస్, శివకుమార్, రాజేందర్, శశాంక్, శ్రీనివాస్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.


మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న భక్తులు

# వాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆలయంలో లక్ష పుష్పార్చన


నర్సాపూర్ పట్టణంలో గల శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆలయ వార్షికోత్సవంలో బాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు


నర్సాపూర్ పట్టణంలో గల శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

**నర్సా పూర్, ఏప్రిల్ 26,ప్రభాత వార్త:**

నర్సా పూర్ పట్టణంలో గల శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి మాత ఆలయ వార్షికోత్స వ మహోత్స వాలు నర్సా పూర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నియమ నిష్టలతో భక్తి శ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు. ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వార్షికోత్స వంలో భాగంగా ఆదివారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతిని పురస్కరించుకొని లక్ష పుష్పార్చన, చండీ యగం నిర్వహించారు. అంతేగాక ఈ ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు ప్రజలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పల్లెర్ల రవీంద్ర,సెక్రటరీ అశోక్, నర్సా పూర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఇమ్మడి శ్రీనివాస్ గుప్త, ప్రధాన కార్యదర్శి జొన్నవాడ మల్లేశం గుప్త నూక శ్రీనివాస్ గుప్తా, రేఖ సతీష్ గుప్త,కొత్త భాస్కర్ గుప్తా,బోర్లపు శ్రీనివాస్ గుప్తా, పద్మ జ్ఞానేశ్వర్ గుప్త, సింగారం సంతోష్ గుప్త మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు .


చిత్రపటానికి పూలమాలలు ఇస్తున్న దృశ్యం

## ఆర్యవైశ్యుల సంక్షేమానికి పెద్దపీట

**పటాన్ చెరు,ఏప్రిల్ 26,ప్రభాత వార్త :**

ఆర్యవైశ్యుల సంక్షేమానికి పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అనునితం పెద్దపీట వేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆర్య వైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి జయంతి పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం పటాన్ చెరు శాఖ ఆధ్వర్యంలో వాసవి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వాసవి మాత జయంతి ఉత్స వాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమాజ సేవలో ఆర్యవైశ్యుల పాత్ర అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు మాశెట్టి రామ్మోహన్ గుప్తా, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**కొమురవెల్లిలో**

**కొమురవెల్లి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని కొమురవెల్లి ఆర్యవైశ్య మిత్రుల సత్రంలో ఆదివారం వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్స వాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారికి కుంకుమ, గణపతి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు

## గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ: సంతోషాలతో జీవించాలి

**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 26,ప్రభాతవార్త :**

మండల పరిధిలోని చింతమడక గ్రామంలో ఆదివారం నిర్వహించిన లంద ఎల్లమ్మ తల్లి, పోచమ్మ తల్లి దేవాలయను వంగ రాజేశ్వర్‌రెడ్డి దర్శించుకొని అమ్మవార్లకు భక్తి శ్రద్దలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల ఆశీస్సు లతో ప్రజల అందరూ సుఖ: సంతోషాలతో జీవించాలన్నారు. చింతమడక గ్రామాల ప్రజలపై అమ్మవార్ల కటాక్షం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎల్లప్పుడు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.


బ్రాహ్మణపల్లిలోని హనుమాన్ ఆలయానికి టైం బెల్ బహుకరించిన దాత నర్సింలు ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

## హనుమాన్ ఆలయానికి టైం బెల్ బహుకరణ

**నర్సా పూర్ ఎప్రిల్ 26, ప్రభాతవార్త :**

నర్సా పూర్ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో హనుమాన్ ఆలయానికి ఆత్రం నర్సింలు టైం బెల్ బహుకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు నర్సింలు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుధీర్ కుమార్ గౌడ్, ఆంజనేయులు, నర్సింలు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

### పెద్దమ్మ ఉత్సవాలలో పాల్గొన్న : హరీష్‌రావు

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 26,ప్రభాతవార్త : జిల్లా కేంద్రంలోని ప్రశాంత్‌నగర్,గణేష్‌నగర్, సుభాష్‌నగర్ ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన పెద్దమ్మ దేవాలయ ఉత్స వాలలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆదివారం పాల్గొన్నారు. పెద్దమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పార్టీ నాయకులు కొండం సంపత్‌రెడ్డి, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, కడవెర్గు రాజనర్సు పాల్గొన్నారు.


పెద్దమ్మ అమ్మవారి ఉత్సవాలలో పాల్గొన్న దృశ్యం

# వాసవి మాత జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే ప్రభాకర్

**సదాశివపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** సదాశివపేట పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవి మాత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని, ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆధ్యాత్మిక శక్తిని పూజించారు.ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందజేశారు.తదనంతరంగా, చింత ప్రభాకర్ భక్తులతో, ఆర్యవైశ్య సంఘ సభ్యులతో కలిసి ఆలయంలో ఏర్పాటు చేసిన అల్పాహార కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, వేడుకలను సాంప్రదాయబద్ధంగా జరిపారు.


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దృశ్యం

# శ్రీభూలక్ష్మిమాత జాతర కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్..

**నారాయణఖేడ్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :**

నారాయణాఖేడ్ మండల్ తుర్కపల్లి గ్రామంలో అత్యంత శక్తివంతమైనా శ్రీ భూలక్ష్మిమాత జాతర కార్యక్రమంలో మున్సి పల్ చైర్మన్ నాగేష్ శెట్కార్, పట్లోలా సుధాకర్ రెడ్డి గార్లు భూలక్ష్మిమాత దేవతను దర్శించుకోవడం జరిగింది.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు నాగేష్ శెట్కార్‌కి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖేడ్ మున్సి పల్ కౌన్సి లర్ వివేకానంద మహేందర్, లక్ష్మణ్, మరియు గ్రామ సర్పంచ్ ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ దత్తు గౌడ్, హౌగి శివకుమార్, అంజగౌడ్, నర్సింహారెడ్డి, పాండు గ్రామస్తులు ఉన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న మున్సిపల్ చైర్మన్ నగేష్ షెట్కార్.


వెంకటేశ్వర కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి దృశ్యం.

## శ్రీవెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే..

**నారాయణఖేడ్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** నారాయణఖేడ్ నియోజకవర్గం నారాయణఖేడ్ మండల పరిధిలోని ఆకుల లింగాపూర్ గ్రామంలో వెలసిన వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన కళ్యాణ మహోత్స వ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, నారాయణఖేడ్ మున్సి పల్ ఛైర్మన్ నగేష్ కుమార్ శేట్కర్ ముఖ్య అతిథిగా హాజరై, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరిగిన కళ్యాణ వేడుకలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులతో కలిసి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హన్మమడ్లు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ వాసవి మాత జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడమే కాకుండా తెలంగాణ పండగల జాబితాలో చేర్పించడం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వైశ్యులకి అండగా ఉంటుందని చేర్పించడం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం వైశ్యులకి అండగా ఉంటుందని ముఖ్య మంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆర్థికంగా వెనుకబడిన ఆర్య వైశ్యుల ప్రయోజనం కోసం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం, వాసవి మాత జయంతిని అధికారికంగా నిర్వహించడం కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఇందుకోసం ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాలువ సుజాత చేసిన కృషి గొప్పదన్నారు. వాసవి మాత జయంతి వేడుకల్లో పాల్గొని అవకాశం ఇచ్చినందుకు ఆయన ఆర్యవైశ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ కార్యాలయంలోనూ వాసవి మాత జయంతి వేడుకలను నిర్వహించారు. వాసవి మాత జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించినందుకు ఆర్యవైశ్య సంఘం వాసవి క్లబ్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని మంగళపేట దుర్గామాత ఆలయం నుండి పొట్టి శ్రీరాములు చౌక్ రాజీవ్ చౌక్ బసవేశ్వర పొట్టి శ్రీరాములు చౌక్ రాజీవ్ చౌక్ బసవేశ్వర చౌకుల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం రాజీవ్ చౌక్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శంకర్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆర్యవైశ్య కార్గో రహీం చైర్మన్ కల్వ సుజాతల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించడం జరిగింది.


వాసవిమాతను పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, తదితరులు.


మున్సిపల్ కార్యాలయంలో వాసవి మాత జయంతి వేడుకలను జరరుపుకుంటున్న దృశ్యం

## ఘనంగా వాసవి మాత జయంతి

**జహీరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** పట్టణంలోని మున్సి నల్ కార్యాలయంలో ఆదివారం వాసవి మాత జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాసతి మాత చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సి పల్ చైర్మన్ ఎండి యూనుస్, వైస్ చైర్మన్ కొత్తకాపు శిరీష సురేందర్‌రెడ్డి, మున్సి పల్ కమీషనర్ జైత్రం, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు బెజుగం వేణుగోపాల్, కార్యదర్శి నామ రవికిరణ్, కాంగ్రెస్ నాయకులు కొత్తకాపు సురేందర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

### గుమ్మడిదల మున్సిపాలిటీలో వాసవి కన్యక పరమేశ్వరి జయంతి



**గుమ్మడిదల, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :**

గుమ్మడిదల మున్సి పాలిటీ పరిధిలో ఘనంగా నిర్వహణ గుమ్మడిదల మున్సి పాలిటీ పరిధిలోని వాసవి కన్యక పరమేశ్వరి దేవి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు చైర్మన్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారు వాసవి కన్యక పరమేశ్వరి దేవి చిత్రపటానికి పూలమాల వేసి, ఆమెలో అత్యంత మాన్యతతో జయంతి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ కుమార్ గౌడ్ , వాసవి దేవి యొక్క శక్తి, ఆదర్శం ఆమె ప్రభావం గురించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, ఈ జయంతి వేడుకలు వాస్తవంగా గ్రామస్థుల మానసిక అభ్యుదయాన్ని ఆధ్యాత్మిక ప్రగతిని దృష్టిలో పెట్టుకుని నిర్వహించబడినాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సి లర్ కత్తుల రమేష్, చూర్ణం చక్రపాణి,నాయకులు వెంకట్ రామ్ రెడ్డి,హుస్సేన్, శ్రీనివాస్ రెడ్డి,ఆంజనేయులు, సత్యనారాయణ,డప్పు శ్రీనివాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా వాసవి కన్యకాపరమేశ్వరి జన్మోత్సవం

**జహీరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవి కన్యకాపరమేశ్వరరి అమ్మవారి జన్మోత్స వాన్ని ఆదివారం ఆర్యవైశ్యులు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని అమ్మవారి ఆలయానికి మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారికి అభిషేకం, సామూహిక కుంకుమార్చన, దోలారోహణం నిర్వహించి లలిత సహస్రనామ పారాయణం చేసి మహామంగళ హారతి నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెజుంగం రాజ్‌గోపాల్, ప్రధాన కార్యదర్శి నామ రవికిరణ్, ఉపాధ్యక్షులు పాండయ్య, కార్యవర్గ సభ్యులు, పట్టణ పుర ప్రముఖులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


వాసవి మాత జయంతిను పురష్కరరించుకుని పూజలు చేస్తున్న భక్తుల దృశ్యం



వీరబ్రహ్మేంద్ర ఆలయ భూమి పూజలో పాల్గొన్న మహేందర్‌రెడ్డి

## ఆలయానికి భూమి పూజ

**పెద్దేముల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** అధ్యాత్మిక వాతావరణంతోపాటు సామాజిక ఐక్యతకు ఆలయాలు కేంద్రాలుగా నిలుస్తాయని ప్రభుత్వ చీఫ్‌విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దేముల్ మండలం కందనెల్లిగుట్టపై శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ శంకుస్థాపన మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఆలయ స్థలం కోసం తాను రూ. 10 లక్షలు విరాళం అందించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం తన ఎంఎల్‌సి నిధుల నుంచి ఆలయ నిర్మాణానికి రూ. 50 లక్షలు అందిస్తామని ప్రకటించారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నేతలతో కలిసి అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో టీపీపీసీ సమన్వయకర్త కరణం పురుషోత్తంరావు, సర్పంచ్ యాదమ్మశ్రీనివాస్, ఉపసర్పంచ్ వాజిద్, మాజీ యం పిటిసి మధులత శ్రీనివాస్‌చారీ, సంఘ అధ్యక్షులు పాండురంగ చారీ, కార్యదర్శి బాలు చారి పాల్గొన్నారు.

**శ్రీవారి ఆలయ అభివృద్ధికి సహకరించాలి**

శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించడం అభినందనీయమని ఆలయ పౌండర్ బిచ్చప్ప అన్నారు. ఖాంజాపూర్ గుట్ట సమీపంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ సన్నిదిలో డబుల్‌బెడ్ రూమ్ కాంట్రాక్టర్లు అమర్‌నాథ్‌రెడ్డి, ఆశన్నలు సిమెంట్ బెడ్ వేయించారు. ఈ సందర్భంగా ఆలయ పౌండర్ బిచ్చప్ప మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. దాతల సహకారంతో ఆలయానికి కొత్త వెలుగులు రానున్నాయన్నారు. మరింతమంది దాతలు సమాజసేవకు, ఆలయాల అభివృద్ధికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



సహాయం అందజేస్తున్న కౌన్సిలర్ అర్చన

## ఆడబిడ్డ వివాహానికి చేయూత

**మేడ్చల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** ఓ పేదింటి ఆడబిడ్డ వివాహానికి ఎల్లంపేట్ మున్సిపల్ 24వ వార్డు కౌన్సిలర్ అర్చన శ్రీనివాస్ పుస్తె, మట్టెలతోపాటు రూ. 25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మున్సిపల్ పరిధి ఎల్లంపేట గ్రామానికి చెందిన రాగం పద్మశ్రీనివాస్‌ల కుమార్తె ప్రవళిక వివాహ నిశ్చయం అయ్యింది.

## ఇంటి నిర్మాణానికి సిమెంట్ పంపిణీ

**తలకొండపల్లి ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల కేంద్రంలో నిరుపేద ఇంటి నిర్మాణం కోసం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి ఉచితంగా సిమెంటు పంపిణీ చేశారు. తలకొండపల్లి సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, ఉపసర్పంచ్ కోటే శ్వర్‌లఆధ్వర్యంలో గ్రామానికి చెందిన రవి ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక స్థోమత లేకపోవడంతో అతనికి ఆదివారం నాడు ఉప్పల ట్రస్ట్ నుంచి ఉచితంగా సిమెంటును అందజేశారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ ఉప్పల ట్రస్ట్ నుంచి ఎంతో మంది నిరుపేదలకు ఉచిత విద్యకు, కార్పొరేట్ ఆసుపత్రి కోసం వైద్య సహాయం, నిరుపేదల ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు వారు తెలిపారు. తలకొండపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో ఉప్పల ట్రస్ట్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా శేఖర్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్ యాదవ్ ఉప సర్పంచ్ కోటీశ్వర్, వార్డు సభ్యులు వెంకటేష్ యాదవ్ పోతుగంటి కుమార్, రవి కుమార్ పద్మ విటల్, కంటం మధు, బొజ్జం యాదయ్య, వెంకటయ్య, రమేష్ తదితరులు ఉన్నారు.

## కార్యకర్తలను కాపాడుకుంటాం

**కుల్కచర్ల, ఏప్రిల్, 26 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను పార్టీ కంటికి రెప్పల కాపడుకుంటుందని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. గత అదివారం మండల కేంద్రంలోని పిఎసిఎస్ అవరణలో డ్రోన్ ప్రారంభత్సోవంలో డ్రోన్ అపరేటింగ్ మిస్ ద్వారా కాంగ్రెస్ పార్టీ మాజి అధ్యక్షుడు వెంకటయ్య గౌడ్ కాలుకు రాంపూర్ సర్పంచ్ చెక్కల తిరుపతయ్య చేతి వెలుకు సల్ప గాయాలు కావడంతో అదివారం డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజనేయులుతో కలిసి వెంకటయ్య గౌడ్‌ను,సర్పంచ్ చెక్కల తిరుపతయ్య పరమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి గోపాల్ నాయక్, మాజి ఎంపిటిసి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు: కలెక్టర్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** అహర్హులైన జర్నలిస్టులకు త్వరలోనే అక్రిడేషన్ కార్డులు అందజేస్తామని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు నూతన మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన వారికి అక్రిడేషన్ కార్డులు జారీ చేయాలని, జిఓ నెం.252 ప్రకారం నిబంధనలు పాటించాలన్నారు. మీడియా ప్రతినిధులు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించి మీడియా వ్యవస్థ పై ప్రజల నమ్మకాన్ని పెంపొందించాలని అన్నారు. సమావేశంలో సభ్యులు తమ అభిప్రాయాలు, సూచనలు కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ సమావేశంలో డీపీఆర్ఓ చెన్నమ్మ, కమిటీ సభ్యులుగా శెట్టి రవిశంకర్, మల్లేశం, రఘు, ప్రహ్లాదచారి, పాపి రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అక్రిడేషన్ కమిటీ సభ్యులతో సమావేశమైన కలెక్టర్ దీపక్ తివారి

## పట్టాలకెక్కుతున్న అభివృద్ధి పనులు

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్, 26 ప్రభాతవార్త:** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని చౌదరిగూడలో అభివృద్ధి పనులు పట్టాలకెక్కుతున్నాయి. ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సర్పంచ్ శ్వేత చంద్రబాబుగౌడ్ కృషి చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి సిసి రోడ్ల ఏర్పాటుకు రూ.30లక్షలు, అంతర్గత మురుగు కాలువల నిర్మాణానికి రూ.12లక్షలు విడుదల అయ్యాయి. రూ.10 లక్షలతో నిర్మిస్తున్న మహిళ సమాఖ్య భవనం, రూ.12 లక్షలతో నిర్మిస్తున్న అంగన్‌వాడి భవనం పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామంలో వీధి లైట్ల సమస్య పరిష్కారానికి కొత్తగా 36 విద్యుత్ స్తంభాలు, వివిధ కాలనీలలో ఐదు హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేశారు. బీసి కాలని నుంచి కమ్మరిపేట, మంగలి గెరి నుంచి కమ్మరిపేట, కమ్మరిపేట నుంచి వెంచర్ వరకు మట్టి పోయించి రోడ్డు పనులు చేపట్టారు. చౌదరిగూడ గ్రామ పంచాయితీని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు మరిన్ని నిధులు అవసరమని సర్పంచ్ శ్వేత చంద్రబాబుగౌడ్ తెలిపారు. గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని, ప్రాధాన్యత క్రమంలో ఒక్కొకటిగా పరిష్కరిస్తున్నామని వివరించారు.



అంతర్గత మురుగుకాలువ పనుల దృశ్యం

## సర్పంచ్‌పై దాడి ఘటనలో దోషులను శిక్షించాలి

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఎల్కగూడ గ్రామ సర్పంచ్‌పై దాడి చేసిన వ్యక్తులను కఠినంగ శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పేద కుటుంబానికి చెందిన సర్పంచ్ బందయ్యపై అగ్రకులానికి చెందిన ఓ వ్యక్తి పథకం ప్రకారం దాడి చేయించారని ఆరోపించారు. గ్రామ సర్పంచ్‌గా బందయ్య ఎన్నిక కావడం జీర్ణించుకోలేక అతనిపై హత్యాయత్నం చేశారని ఆరోపించారు. సమావేశంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షురాలు శ్వేత, సర్పంచ్‌లు చంద్రశేఖర్, జంగయ్య, చందునాయక్, రాంచంద్రయ్య, నర్సింహులు, నీలయ్య, నాయకులు శివమౌళి, సత్యం, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చలివేంద్రంపల్లి రాజు



ఆమనగల్లు అంబేడ్కర్ సంఘం నూతన కార్యవర్గం

## అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక

**ఆమనగల్లు, ఏప్రిల్26, ప్రభాతవార్త:** ఆమనగల్లు అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా లండం చిన్న జంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఆమనగల్లు పట్టణంలో సంఘం ఫౌండర్ వంకేశ్వరం భీమయ్య అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈమేరకు నూతన కమిటీని ఎనుకున్నట్లు ఆయన తెలిపారు. అధ్యక్షుడిగా లండం చిన్నజంగయ్య, ఉపాధ్యక్షులుగా వస్పుల సురేష్, వస్పుల రంజిత్, ప్రధాన కార్యదర్శిగా నాగిళ్ల లక్ష్మణ్, మీసాల రమేశ్, పుల్లారెడ్డి శ్రీశైలం, సహకార్యదర్శిగా ఎండీ అప్సర్, యడవల్లి రమేశ్, కోశాధికారిగా లండం గిరి, నేనవాత్ పవన్, సెక్రటరీ పాత్లావత్ రవి, మద్దేల నరేశ్, యువజన విభాగం సమన్వయ కర్తలుగా వడ్డెమోని శివకుమార్, తలారి శివకుమార్, వస్పుల శంకర్ తదితరులు ఉన్నారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడు లండం చిన్నజంగయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలు సాధించటానికి, ఆయన సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకువెళ్లటానికి కృషి చేస్తానన్నారు.



## స్నేహితుని కుటుంబానికి రూ. లక్ష సహాయం

**తలకొండపల్లి ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** చిన్ననాటి స్నేహితుడు మృతితో కలత చెందిన మిత్రబృందం మానవత్వంతో బాధితుని కుటుంబానికి బాసటగా నిలిచింది. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన బురముని నరసింహ ఈనెల 6న అనారోగ్యానికి గురై మృతి చెందాడు. నర్సింహకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆ కుటుంబానికి 2000-01 సంవత్సరంలో పదవ పదవ తరగతి బ్యాచ్ బృందం స్వచ్ఛందంగా లక్ష రూపాయలు అందజేసింది. చిన్న వయసులో అనారోగ్యానికి గురై మృతి చెందడం అతని కుటుంబానికి తీరని లోటుని స్నేహితులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారిని అభినందించారు.



పారిశుధ్య సిబ్బందితో కలిసి రోడ్లను శుభ్రం చేస్తున్న కాలనీ అధ్యక్షుడు మన్యం

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు తమ ఇంటితో పాటు పరిసరా ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని సుప్రభాత్ టౌన్‌షిప్ కాలనీ అధ్యక్షుడు గొబ్బరి మన్యం అన్నారు. పోచారం డివిజన్ కొర్రెముల పరిధిలోని సుప్రభాత్ టౌన్‌షిప్‌లో ఆదివారం స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా కార్పోరేషన్ పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. భారత ప్రభుత్వం 94 రోజుల స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా కాలనీలో చీపుర్లు చేతపట్టి పారిశుధ్య సిబ్బందితో కలిసి రోడ్లను ఊడ్చారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు మాట్లాడుతూ పచ్చదనం, పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన ఎంతో అవసరమని అన్నారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జి. మన్యం, సభ్యులు బంగారి రాజయ్య, టి. హరనాథ్, యం. రాజనర్సు, ఎస్. లక్ష్మీనారాయణ, వెంకట్‌రెడ్డి, చుక్కల నర్సయ్య, బి. మల్లయ్య, సర్జిత్ సింగ్, ఆలయ పూజారి బాస్కర శర్మ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నంకు స్వాగతం పలుకుతున్న ఆమనగల్లు కాంగ్రెస్ నేతలు

## కల్వకుర్తి డిపోకు అదనంగా 20 కొత్త బస్సులు

**ఆమనగల్లు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆమనగల్లు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. హైదరాబాదు నుండి శ్రీశైలం వెళుతున్న పొన్నం ఆదివారం ఆమనగలు పట్టణంలో కొద్దిసేపు ఆగారు. టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికి మంత్రికి స్వాగతం పలికారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెను విరమింపజేయడంలో మంత్రి చూపిన చొరవను కొనియాడుతూ ఆయనను సత్కరించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరిక మేరకు కల్వకుర్తి డిపోకు అదనంగా 20 కొత్త బస్సులు కేటాయించినట్లు ఈ సందర్భంగా మంత్రి పొన్నం వెల్లడించారు. బీసీ సంక్షేమ శాఖ నుంచి కల్వకుర్తి నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, మైసిగండి మైసమ్మ దేవాలయం వద్ద ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయాలని శ్రీనివాస్ గౌడ్ మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో యువజన కాంగ్రెస్ తాలూకా ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, నాయకులు యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, ఖరీమ్, సురేష్, అలీమ్ తదితరులు ఉన్నారు.

## ఫ్యూచర్ సిటీతో కందుకూరుకు ఉజ్వల భవిష్యత్తు

**కందుకూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చుతున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగా రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కందుకూరు మండలం దెబ్బడగూడ గ్రామంలో స్థానిక సర్పంచ్ మల్లేపల్లి బాలరాజ్, మాజీ సర్పంచ్ ఏనుగు శ్రావణి ఇలా ఆధ్వర్యంలో ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణా నాయక్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం పేదవాడి ఇంటికలను దూరం చేసిందని విమర్శించారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కిచెన్ గారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో దెబ్బడగూడ గ్రామానికి 61 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడం జరిగిందని ఇందులో చాలావరకు నిర్మాణాలు పూర్తిచేసుకుని గృహప్రవేశాలు నిర్వహించుకుంటుంటం అభినందనీయమన్నారు. నేడు కాంగ్రెస్ పాలనలో ఈ ప్రాంతానికి మంచి భవిష్యత్తు రాబోతోందని ఫ్యూచర్ సిటీ ఈ మండల పరిధిలోనే ఏర్పాటు కాబోతుందని దానికి ప్రత్యేక ప్రణాళికలు రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తోందని, రాబోయే రోజుల్లో ఈ ప్రాంతానికి మంచి భవిష్యత్తు ఉంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మండల మాజిక్ ఆప్షన్స్ సభ్యులు సులేమాన్ వాడు మెంబర్లు ఆంజనేయులు, కందడి నరేష్, డి మమతా భాస్కర్, శ్వేతా విక్రం రెడ్డి, పి శేఖర్‌తో పాటు ఇందిరమ్మ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు అధికారులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి



వాసవీ మాత జయంతి కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్

## కలెక్టరేట్‌లో వాసవీ మాత జయంతి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న వాసవి మాత జయంతి ఉత్సవాలను వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశం హాలులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏటా ఈ ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా...క్రీడాల అభివృద్ధి శాఖ అధికారి సత్తార్, వైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 4,230మంది రైతులకు రుణ మాఫీ

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీతో జిల్లెడు చౌదరిగూడ మండలంలోని 4,230మంది రైతులకు ప్రయోజనం చేకూరింది. మండల వ్యాప్తంగా రూ.34 కోట్ల 83లక్షల 74 వేల 217 విడుదల చేయటంతో అన్నదాతలు వ్యవసాయ రుణాల నుంచి విముక్తి పొందారు.

## డిజె నిర్వాహకులపై కేసు నమోదు

**కేశంపేట, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** ఎలాంటి అనుమతులు లేకుండా సౌండ్ పొల్యూషన్ చేస్తున్న డిజె నిర్వాహకులు శివ, ఆపరేటర్ ముస్రాఫ్‌పై కేసు నమోదు చేసినట్లు సిఐ నరహరి తెలిపారు. కేశంపేట మండల పరిధిలోని నిర్దావెల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున 1:30 గంటల ప్రాంతంలో డీజే బృందాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రజలకు ఎవరు అసౌకర్యం కల్పించినా కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు.



ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానిస్తున్న యాదిలాల్

## ఎమ్మెల్సీ కోదండరామ్‌కు సన్మానం

**ఆమనగల్లు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమ జేఏసీ కన్వీనర్, ఎమ్మెల్సీ కోదండరాంను ఆమనగల్లు బార్ అసోషియేషన్ అధ్యక్షులు అండేకర్ యాదిలాల్ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కోదండరాం పాత్రను కొనియాడుతూ ఎమ్మెల్సీ పదవితో ఆయన తగిన గుర్తింపు లభించిందని యాదిలాల్ హర్షం తెలిపారు. ఆదివారం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి గణేష్ గౌడ్‌తో కలిసి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలుసుకున్నారు.



సాయం అందిస్తున్న డిప్యూటీ కమిషనర్ వెంకటరామ్ దంపతులు

## అనాథ చిన్నారులకు ఆసరా

**ఆమనగల్లు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** తల్లిదండ్రులు, తోబుట్టువులను కోల్పోయి అనాథలుగా మారిన ముగ్గురు చిన్నారులను జల్‌పల్లి మున్సిపాలిటీ డిప్యూటీ కమిషనర్ వెంకట్ రామ్ అక్కున చేర్చుకుని మానవత్వాన్ని చాటారు. ఆమనగల్లు మండలం సీతారంనగర్ తండా పరిధిలోని పులిగోనిపల్లి తండాకు చెందిన రాందాసునాయక్ తన భార్య, ఇద్దరు చిన్నారులను హత్య చేసి రిమాండ్‌పై జైలుకు వెళ్ళి అక్కడ ఆయన ఫిట్స్ వ్యాధితో మరణించిన విషయం తెలిసిందే. దీంతో ఆకుటుంబంలో మిగిలిన ముగ్గురు ఆడపిల్లలు అనాథలుగా మారి పోయారు. ప్రస్తుతం వారి జీవనం గడ్డు స్థితిలో ఉండడంతో జల్‌పల్లి మున్సిపాలిటీ డిప్యూటీ కమిషనర్ వెంకట్ రామ్ తన సతీమణి రాజేశ్వరితో కలిసి ఆదివారం తండాలో బాధిత చిన్నారులను కలుసుకుని తన ఔదార్యాన్ని ప్రదర్శించారు. బాధితులకు రూ. 25వేలు నగదు, మూడు క్వింటాళ్ల బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. ఈసందర్భంగా తండావాసులు ఆదంపతులను అభినందించారు.



పరామర్శిస్తున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

## సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

**ఆమనగల్లు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** ఆమనగల్లు మండలం శంకర్‌కొండతండా సర్పంచ్, కాంగ్రెస్‌పార్టీ మాజీ మండలాధ్యక్షుడు మండ్లీ రాములుకు ఆదివారం పితృవియోగం కలిగింది. అతని తండ్రి మండ్లీ అంజయ్య అనారోగ్యంతో కన్ను మూసారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డితోపాటు పలువురు ప్రముఖులు మృతుని పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సర్పంచ్ రాములుకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల పార్టీ అధ్యక్షుడు తెల్గుమళ్ల జగన్‌తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## మంత్రుల మేలు మరువలేం

**మేడ్చల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** మేడ్చల్ బస్ డిపో కార్మికులు ఆదివారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి వివేక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకుడు అశ్వథామరెడ్డితో కలిసి వెళ్లిన నాయకులు మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రుల మేలు మరిచిపోలేమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.



మంత్రి పొన్నంను కలిసిన మేడ్చల్ డిపో కార్మిక నాయకులు

# ఉద్యోగ సాధనకు ఉచిత శిక్షణా విప్లవం

## గ్రామీణ యువతకు భరోసాగా సుంకిరెడ్డి

**రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** గ్రామీణ నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో అండగా నిలుస్తూ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలు విశేష ఆదరణ పొందుతున్నాయి. కల్వకుర్తి నియోజక వర్గంలోని ఆమనగల్, తలకొండపల్లి, కడ్తాల్, మాడ్గుల మండల కేంద్రాల్లో ఎస్సై, కానిస్టేబుల్ ఉచిత శిక్షణ కేంద్రాలను ప్రారంభించి గ్రామీణ యువతలో కొత్త ఆశలు నింపారు. పోలీస్ ఉద్యోగం సాధించాలనే కల ఉన్నా ఆర్థిక ఇబ్బందులు, సరైన శిక్షణా వసతుల లేమితో వెనుకబడుతున్న యువతకు ఈ కేంద్రాలు ఒక వరంగా మారనున్నాయి.

**సేవా దృక్పథంతో ముందుకు..**

సామాజిక సేవను లక్ష్యంగా పెట్టుకుని యువత భవిష్యత్తు కోసం సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం విశేషంగా ప్రశంసలు అందుకుంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభకు కొదవలేదని, కానీ అవకాశాల లేమే ప్రధాన సమస్యగా మారిందని గుర్తించిన ఆయన ఆ సమస్యకు పరిష్కారంగా మండల కేంద్రాల్లోనే ఉచిత శిక్షణ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉద్యోగం కోసం కష్టపడే ప్రతి యువకుడికి సరైన దిశానిర్దేశం, శిక్షణ, ప్రోత్సాహం అందించాలనే సంకల్పంతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

**పట్టుదలే విజయానికి మూలం**

ఈ సందర్భంగా మాట్లాడిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గ్రామీణ నేపథ్యం, పేదరికం మన లక్ష్యాలకు అడ్డంకి కాకూడదు. అవకాశాన్ని అందిపుచ్చుకుని కష్టపడి సాధిస్తే పోలీస్ ఉద్యోగం సాధించడం అసాధ్యం కాదు. పల్లెల్లోని యువతలో ఉన్న ప్రతిభను వెలికితీయడమే మా లక్ష్యం అని స్పష్టం చేశారు. ఈ శిక్షణ కేంద్రాల ద్వారా రాబోయే రోజుల్లో వందలాది మంది యువత ఉద్యోగాలు సాధించి కుటుంబాలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు.

**ఉద్యోగ సాధనకు సమగ్ర శిక్షణ**

ఈ కేంద్రాల్లో కేవలం రాత పరీక్షకు మాత్రమే కాకుండా శారీరక దారుఢ్యం, పరుగు సాధన, మానసిక స్థైర్యం, క్రమశిక్షణ, మాక్ టెస్టులు వంటి అంశాలపై సమగ్ర శిక్షణ అందించనున్నారు. పట్టణాల్లో లక్షలు ఖర్చు పెట్టి పొందే శిక్షణను గ్రామీణ యువతకు ఉచితంగా అందించడం ద్వారా సుంకిరెడ్డి ఒక సామాజిక ఉద్యమానికి శ్రీకారం చుట్టినట్టే అయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**గ్రామీణ యువతలో నూతనోత్సాహం...**

ఈ శిక్షణ కేంద్రాల ప్రారంభంతో కల్వకుర్తి నియోజకవర్గంలోని యువతలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఉద్యోగ సాధనపై ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు, కష్టపడితే లక్ష్యం చేరుకోవచ్చనే నమ్మకం బలపడుతోంది. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామీణ యువత భవిష్యత్తును మలిచే దిశగా కీలక అడుగుగా



మాట్లాడుతున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



క్రీడా శిక్షణా శిబిరంలో పాల్గొన్న యువకులు